క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందాలి



మైలవరం: విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందాలని సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఆర్వీ టెక్నాలజీ సొల్యూషన్ ఎండీ వి. రమేష్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి కాలేజీ ఎంబీఏ విద్యార్థులకు సీఐఐ ద్వారా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్వ్యూ అనేది ఒక వైపు సంభాషణ కాదని, రెండు వైపులా ఉంటుందన్నారు. విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలో విజయం సాధించేందుకు సహాయ పడే వివిధ చిట్కాలను వివరించారు. హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఎ.ఆదిశేషారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చందనోత్సవం

తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి దేవస్థానంలో మంగళవారం చందనోత్సవం నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు దేవయాజనం వేణుగోపాలాచార్యులు తెలిపారు. ఉదయం 7 గంటలకు తిరుప్పావై, సేవా కాలం, అనంతరం స్వామి వారికి చందనోత్సవం జరుగుతుందని చెప్పారు.

పవర్ లిఫ్టర్ స్వర్ణకుమారికి సత్కారం



మైలవరం: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం, సీనియర్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కొల్లూరు స్వర్ణకుమారిని మైలవరంలోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కుంటముక్కల గ్రామానికి చెందిన కొల్లూరు స్వర్ణకుమారిని అభినందిస్తూ శ్రీనివాస ట్రేడర్స్ అధినేత వీవీ శ్రీనివాస్ రూ. 5 వేల చెక్కును అందజేశారు. కొల్లూరు రమాదేవి, వంగపల్లి చైతన్య, ఎం. శంకరరావు, నాగ సిద్ధార్థ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణం



నందిగామ రూరల్: శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు చేశారు. అనంతరం ఎదురుకోలోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరించిన కల్యాణ మండపంలో పండితులు యోగానందాచార్యులు, అనంతాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు. ఆలయ కమిటీ సభ్యులు నకిరికంటి విశ్వేశ్వరరావు, గద్దె మధుసూదనరావు, బండారు కేదార్‌నాథ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు స్వామి వారి శేష వస్త్రం, ఆశీర్వచనం అందజేశారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా రీసర్వే చేయండి

నందిగామ టౌన్: ప్రభుత్వం జారీ చేసిన టైమ్ లైన్ ప్రకారం తప్పులకు ఆస్కారం లేకుండా భూ రీసర్వేను పూర్తి చేయాలని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో.. డివిజన్ పరిధిలో సర్వేలో పాల్గొనే సిబ్బందికి మంగళవారం రీ సర్వే వర్క్ షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీరులపాడు మండలం వెల్లంకి, నందిగామ మండలం లచ్చపాలెం, జగ్గయ్యపేట మండలం గండ్రాయి, పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల, వత్సవాయి మండలం లింగాల గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతుందన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ర్యాలీలు, గ్రామ సభలు జరిగాయన్నారు. ప్రధానంగా విలేజ్ బౌండరీ, బ్లాక్ బౌండరీలతో పాటు ప్రభుత్వ భూములను ఫిక్స్ చేయాలని సూచించారు. రైతులకు అవగాహన కలిగించి రీసర్వేలో పాల్గొనేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ త్రివిక్రమరావు, డీఐఎస్ వెంకటస్వామి, డివిజన్‌లో తహసీల్దార్‌లు, రీసర్వే డీటీలు, మండల సర్వేయర్‌లు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో అడ్మిషన్ల వేట



తిరువూరు మండలం గానుగపాడు జెడ్పీ హైస్కూల్‌లో అడ్మిషన్ల ప్రచార కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



తిరువూరు మండలం గానుగపాడులో బడిబాట నిర్వహించి అడ్మిషన్ అందజేస్తున్నఉపాధ్యాయులు (ఫైల్)

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రచారం
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు కసరత్తు
- కరపత్రాలు పంపిణీ చేసి తల్లిదండ్రులకు అవగాహన

తిరువూరు: రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపునకు తిరువూరు డివిజన్‌లోని ప్రభుత్వ ఉపాధ్యాయులు కసరత్తు చేస్తున్నారు. తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో 250 ప్రభుత్వ పాఠశాలలుండగా తొలి విడత 25 పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. తమ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, గత ఏడాది సాధించిన విద్యాప్రగతి, ఉపాధ్యాయుల వివరాలతో రూపొందించిన కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

పదో తరగతి ఫలితాల ప్రాతిపదికగా...

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పదో తరగతిలో సాధించిన మార్కులను సూచికగా చూపి విద్యా ప్రమాణాలను చూసి పిల్లల్ని చేర్పించాలంటూ ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రీస్కూల్ పూర్తయిన పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనే చేర్చాలని, కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు పంపవద్దని కోరుతున్నారు. ఉచిత మధ్యాహ్న భోజన పథకం, పాఠ్య పుస్తకాల సరఫరా తదితర సదుపాయాలను వివరిస్తున్నారు. గానుగపాడు, తిరువూరు, గంపలగూడెం జెడ్పీ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బడి బాట ప్రచారం చేపట్టారు.

విలీనంతో స్కూళ్లు మూతబడే పరిస్థితి..

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల కేటగిరీల్లో మార్పు చేస్తూ విద్యార్థుల సంఖ్యకనుగుణంగా పలు స్కూళ్లను విలీనం చేసే ప్రక్రియకు సన్నాహాలు చేస్తుండటంతో తిరువూరు డివిజన్‌లో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఆదర్శ పాఠశాలల వ్యవస్థను కొత్తగా తెరమీదకు తెస్తుండటంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు దూరం కానున్నాయి. పాఠశాలల మూసివేతను ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ వచ్చే విద్యా సంవత్సరం నుంచే సంస్కరణలు అమలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా పాఠశాలల కొనసాగింపు, మూసివేత జరిగే అవకాశం ఉండటంతో ఇప్పటి నుంచే అడ్మిషన్ల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు స్వచ్ఛంద బడి బాట కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు తమ పరిధిలోని గ్రామాల్లో, పాఠశాలల పరిసరాల్లో చేస్తున్న ప్రచారం సత్ఫలితాలిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది.

– శ్యాంసుందర్, ఎంఈఓ, తిరువూరు

తల్లిదండ్రులు సహకరించాలి



తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి తల్లిదండ్రులు సహకరించాలి. విద్యా ప్రమాణాలు పాటిస్తూ ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నందున కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన బోధన జరుగుతోంది.

– ఆదిలక్ష్మి, ప్రధానోపాధ్యాయిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, గానుగపాడు

నిషేధిత మందులను విక్రయించొద్దు

తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

తిరువూరు: ప్రభుత్వం నిషేధించిన మందులను విక్రయించడం చట్టరీత్యా నేరమని తిరువూరు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె. సత్యనారాయణ అన్నారు. స్థానిక పోలీసు స్టేషనులో తిరువూరు మండలంలోని మందుల దుకాణదారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు మందుల చీటీలు రాయడం, మందులు విక్రయించడం చట్టవిరుద్ధమన్నారు. డాక్టరు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించినట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 1940 డ్రగ్స్ చట్ట ప్రకారం నిషేధిత మందులను విక్రయించరాదని, పదేళ్లలోపు పిల్లలకు హాని కలిగించే మత్తు పదార్థాలను అమ్మవద్దని ఎస్‌ఐ కోరారు. హోల్‌సేల్ వ్యాపారులకు పలు సూచనలు చేశారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో చెరువులు

నీరు లేక ఎండిపోతున్న వైనం



చంద్రగూడెంలో ఎండిపోతున్న చెరువు



కొత్త మంగాపురంలో నీరు లేక వెల వెల పోతున్న మేజర్ కాలువ

మైలవరం: మైలవరంలోని చెరువులు, ఇరిగేషన్ కాలువల అభివృద్ధిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో చుక్కనీరు లేక ఎలాతెలా పోతున్నాయి. చెరువుల్లో మేట వేసి పూడుకు పోతున్నాయి. నియోజకవర్గంలోని మైలవరంలో 36 మేజర్, మైనర్ ఇరిగేషన్ చెరువులు, రెండు మేజర్ కాలువలు, నాలుగు మైనర్ కాలువల ద్వారా సుమారు 23 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. చెవుటూరు మేజర్, వెల్వడం మేజర్ ద్వారా మైలవరం, జి.కొండూరు మండలాలకు సాగు నీరు అందుతోంది. జి.కొండూరులో 18 మేజర్ ఇరిగేషన్ చెరువులు, 19 పంచాయతీ రాజ్ చెరువులు, ఎన్ఎస్‌పీ కాలువలు చెవుటూరు మేజర్, కొండపల్లి మేజర్ ద్వారా సాగు నీటిని సరఫరా చేస్తున్నారు. మైలవరం మండలంలో 24 వేల ఎకరాలు పంటలు సాగవుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెరువులు, కాలువల అభివృద్ధి పట్టించుకోకపోవడంతో భవిష్యత్‌లో సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే నీరు లేక చెరువులు ఎండిపోతున్నాయి.

అందని ద్రాక్షగా సాగునీటి సరఫరా

గతంలో మెట్ట ప్రాంతమైన మైలవరం నియోజకవర్గంలో వర్షంనీటిపై ఆధారపడి రైతులు వేరుశనగ, మొక్కజొన్న, రాగులు తదితర పంటలు పండించేవారు. సాగర్ ఎడవ కాలువ ద్వారా మూడో జోన్ పరిధిలో 2.10 లక్షలు ఎకరాలకు సాగు నీరు అందుతోంది. సాగర్ ఎడమ కాలువ నుంచి మూడో జోన్‌లోని మైలవరం, నూజివీడు బ్రాంచి కాలువలకు నవంబర్ నుంచి ఏప్రిల్ 15 వరకు రాష్ట్ర విభజన ఒప్పందం ప్రకారం 32 టీఎంసీల నీరు సరఫరా చేయాల్సి ఉంది. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణ ప్రభుత్వ ఇబ్బందులతో సాగు నీటి సరఫరా మన రాష్ట్రానికి అందని ద్రాక్షగా మారింది.

మొక్కుబడి సరఫరాతో అందని నీరు

ఈ ఏడాది మార్చి వరకు 18టీఎమ్‌సీల నీటి సరఫరాతో పూర్తయిందని చెప్పారు. రాష్ట్రం ఒత్తిడి తేవడంతో మార్చి 20 నుంచి కొద్దిగా సరఫరా చేయడం జరిగింది. మేజర్‌లకు మొక్కుబడి నీటి సరఫరాతో చెరువులకు నీరందలేదు. దీనితో అత్యధిక శాతం చెరువులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇదే కొనసాగితే భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విస్సన్నపేట: ఎన్టీఆర్ జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికలు, బాలుర పాఠశాలల్లో మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో చేరగోరు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కొండపర్వ గురుకుల పాఠశాల కన్వీనర్ జి. ప్రసూన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విస్సన్నపేట, కొండపల్లి, జగ్గయ్యపేట, మైలవరం, నందిగామల్లోని గురుకులాల్లో ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి మే 20 లోగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

సీఆర్పీకి సన్మానం

విస్సన్నపేట: మండలంలోని కలగరలో కమ్యూనిటీ రిసోర్సు పర్సన్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఎం. సుందరరావును మంగళవారం ఎంపీడీఓ చినరాట్నాలు, అధికారులు సత్కరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు ప్రజల నుంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఎంఈఓ సుధాకర్, వేమిరెడ్డిపల్లి, పుట్రేల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, సౌభాగ్యం తదితరులు సుందరరావును సత్కరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

చాట్రాయి: రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సంపద సృష్టించి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, అభివృద్ధి పనులకు ఎలాంటి ఢోకా లేదని చెప్పారు. తల్లికి వందనం, రైతు భరోసా వచ్చే నెలలో అందజేస్తామన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని 50 వేల ఎకరాల్లో రాజధానిని నిర్మించబోతున్నామని, ఇందు కోసం మే 2న అమరావతిలో రాజధాని పునర్నిర్మాణ పనులు పారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారని చెప్పారు. ఎంపీపీ లంకా నిర్మల, తహసీల్దార్ గీత, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు, ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులు విధిగా అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో వద్ద రెండో రోజు మంగళవారం రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. డిపో చైర్మన్ కె.నరసింహారావు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ లీవ్‌లు మంజూరు చేయాలని, ఉద్యోగుల భద్రతకు సంబంధించి 1/2019 జీఓ అమలు చేయాలని, డిపో గ్యారేజీ, కార్యాలయాల్లో సమస్యలు తక్షణం పరిష్కరించాలని, నైట్ అవుట్ అలవెన్స్ మంజూరు చేయాలని కోరారు. యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



బాల్య వివాహాలపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీడీ శ్రీలక్ష్మి

నందిగామ రూరల్: బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, వాసవ్య మహిళా మండలి సంయుక్తాధ్వర్యంలో నియోజకవర్గంలోని పాస్టర్లు, పురోహితులు, మైనార్టీ ఖాజీలకు బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు యువకులకు 21 ఏళ్ల వయసు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. ముఖ్యంగా బుధవారం అక్షయతృతీయ సందర్భంగా వివాహాలు జరిగే అవకాశం ఉండటంతో బాల్య వివాహాల నియంత్రణలో భాగంగా అవగాహన కలిగించినట్లు తెలిపారు. కిశోర బాలికలకు మే రెండు నుంచి జూన్ 10 వరకు ప్రత్యేక క్యాలెండర్ ద్వారా బాల్య వివాహాలు, పోక్సో, ఋతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య, తదితర విషయాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ జిల్లా అధికారి రాజేశ్వరరావు, ఎంపీడీవోలు శ్రీనివాసరావు, నాంచారయ్య, ఏసీడీపీవో కృష్ణకుమారి, ఈవో బొగ్గవరపు రవీంద్రబాబు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించండి



వత్సవాయి: కమ్యూనిటీ హెల్త్ అధికారులు(సీహెచ్ఓ)ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వత్సవాయి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ సీహెచ్‌వోలుగా ఆరేళ్లు పూర్తిచేసుకున్న వారిని రెగ్యులర్ చేయడం, జాతీయ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 వేతన పెంపుదల అమలు చేయడం, నిర్దిష్టమైన జాబ్‌చార్టు అమలు చేయడం, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో ఉన్నా ఎమర్జెన్సీలో సేవల్లో మాత్రం అందుబాటులో ఉంటామన్నారు. కె.మధు, డి.సురేష్, డి.ఇందిరాప్రియదర్శిని, సీహెచ్ సీతామహాలక్ష్మి, జి.స్వాతి పాల్గొన్నారు.

నేడు నగరోత్సవం

తిరువూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా బుధవారం నగరోత్సవం నిర్వహిస్తామని ఆలయ అనువంశిక ధర్మకర్త దారా శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు నగరోత్సవం ప్రారంభమవుతుందన్నారు.

మజ్జిగ పంపిణీ

నూజివీడు: మండుతున్న ఎండల నుంచి ప్రజలను సేద తీర్చేందుకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో 31వ రోజైన మంగళవారం మజ్జిగను పంపిణీ చేశారు. యండూరి వెంకట రామకిశోర్ సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

2న రామాలయ వార్షికోత్సవం

తిరువూరు: గంపలగూడెం మండలం ఊటుకూరు కోదండ రామస్వామి దేవాలయ 12వ వార్షికోత్సవం మే 2న జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు పద్మనాభుని సర్వేశ్వరరావు తెలిపారు. స్వామి వారికి విశేష పూజలు, పల్లకీ సేవ, ద్వాదశ ప్రదక్షిణలు తదితర కార్యక్రమాలు ఆలయ అర్చకులు మరింగంటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పలు ట్రేడుల్లో చేరేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రధానాధికారి దేవరకొండ భూషణం మంగళవారం తెలిపారు. ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన వారు, పదో తరగతి ఉత్తీర్ణులు, ఫెయిలైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 24 వరకు అభ్యర్థులు ఐటీఐ అడ్మిషన్స్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసి, ఆన్‌లైన్‌లో సమర్పించిన కాపీలను ప్రింట్ తీసుకొచ్చి కళాశాలలో అందజేయాలని చెప్పారు. మే నెల 24 నుంచి 26 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తామన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని చెప్పారు.

మహనీయుల జీవితాలు ఆదర్శంగా తీసుకోవాలి

నూజివీడు: స్వాతంత్ర్య పోరాటంలో ఎంతోమంది తమ జీవితాలను త్యాగం చేశారని, అటువంటి మహనీయుల జీవితాలను విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో పలు విజ్ఞాన పుస్తకాలు, కథల పుస్తకాలు చదివించారు. అనంతరం పలువురు విద్యార్థులతో కథలు చెప్పించారు. క్యారమ్స్, చెస్ వంటి ఆటలు నేర్పించారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గ్రంథాలయానికి విద్యార్థులు వచ్చి పుస్తకాలు చదువుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దేవినేని అవినాష్ రాక

తిరువూరురూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ బుధవారం తిరువూరు మండలం జీకొత్తూరు రానున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తెలిపారు. ఇటీవల పాముకాటుకు గురై మరణించిన పార్టీ సీనియర్ నాయకుడు శీలం కృష్ణారెడ్డి కుటుంబాన్ని అవినాష్ ఉదయం 10 గంటలకు జీకొత్తూరులో పరామర్శిస్తారని చెప్పారు.

20 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: అక్రమంగా తరలిస్తున్న సారాను స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్‌ఐ మస్తానరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చనుబండ గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా విస్సన్నపేట మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన బాణావతు ఏసు వద్ద 20 లీటర్ల సారాను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పోతనపల్లి తండాలో 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి మాలావతు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశామన్నారు.